## గృహ నిర్మాణ పనులు వేగవంతం కావాలి

**ప్రజాశక్తి -హుకుంపేట:** గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ఈశ్వరి సూచించారు. తీగలవలస పంచాయతీ ఓలుబెడ్డ గ్రామంలో గృహ నిర్మాణ పనులను శుక్రవారం శంకుస్థాపన చేశారు. ప్రతి శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రౌండింగ్ మేళ కార్యక్రమం ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేయాలని ఆదేశించారన్నారు. గృహ నిర్మాణాలు చేపట్టిన మొదటి వారం రోజుల్లోనే బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. మంజూరైన లబ్ధిదారులు నూతన గృహ నిర్మాణాలకు ప్రారంభించాలన్నారు. మండలంలో 1088 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. సర్పంచ్ కిల్లో బెసు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎఇ

# విద్యుత్ భారాలపై సిపిఎం నిరసనలు

చింతపల్లిలో నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి- చింతపల్లి :** ట్రూ అప్ చార్జీల పేరుతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపనుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై భారం మోపే పనిలో పడిందన్నారు. స్థానిక సబ్‌స్టేషన్ కూడలి వద్ద సిపిఎం నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అధికారంలో రాగానే ప్రజలపై ఏ రకమైన భారం మోపమని, ధరలు పెంచబోమని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో పెన్షన్ పెంపు తప్ప ఏవీ అమలు చేయలేదన్నారు.సూపర్ సిక్స్ పథకాల్లో ఏదీ అమలు కాలేదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి, సింహాచలం, రాంబాబు పాల్గొన్నారు.

**అరకులోయ రూరల్:**విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అరకులోయ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, పేద ప్రజలపై విద్యుత్ బారాలు పెంచరాదన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పొరేట్ శక్తులకు విద్యుత్తు కట్టబెట్టడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసి పేదలపై భారాలు మోపితే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.రమేష్, పి రామన్న, పి నానిబాబు పాల్గొన్నారు.

**హుకుంపేట:** విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమాఎన్ని ఉద్దేశించి సీపీఎం మండల కమిటీ సభ్యులు పాంగి లింగమూర్తి మాట్లాడుతూ, ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో ఆర్థికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ భారాలు మోపడంతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఉందని తెలిపారు.తక్షణమే స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి క్రిష్ణారావు, జి.ఆనంద్, కే.వెంకట రమణ, కనకరాజు పాల్గొన్నారు.

**కూనవరం, విఆర్.పురం:**ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారాలు మోపడాన్ని నిరసిస్తూ, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సిపిఎం కూనవరం, విఆర్.పురం మండలాల కమిటీల ఆధ్వర్యాన శుక్రవారం కూనవరం మండలం భీమవరం సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి ముందు కూనవరం సిపిఎం కార్యాలయం నుండి భీమవరం సబ్‌స్టేషన్ వద్ద బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గంటపాటు ఆందోళన చేపట్టి, విద్యుత్‌శాఖ జెఇ రాజ కపూర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, కూనవరం వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరదలకు రైతులు పంట నష్టపోయి ఉన్నారని, ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని, ఇటువంటి సమయంలో రైతులపై భారాలు మోపడం దారుణమన్నారు. ఆదాని, అంబానికి కట్టబెట్టడానికే ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని కూటమి ప్రభుత్వ తీసుకొచ్చిందని, తక్షణమే స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులను ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కూనవరం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, సోడి మల్లయ్య, కారం సుందరయ్య, పోడియం శ్రీరామ్మూర్తి, కె.సత్యనారాయణ, కె.కాంతారావు, జి.లక్ష్మణరావు, సిహెచ్ సుబ్బారావు, ప్రకాష్‌రావు, తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అరకులోయలో నినాదాలు చేస్తున్న నాయకులు

హుకుంపేటలో..

కూనవరం మండలం భీమవరంలో..

పంపు స్టోరేజీ డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎఫ్ఓ తదితరులు

## పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణ స్థలం పరిశీలన

**ప్రజాశక్తి -సీలేరు**

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించబోయే సీలేరు పంప్డు స్టోరేజ్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన ప్రాంతాన్ని చింతపల్లి డిఎఫ్ఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వై.వెంకట నరసింహారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ అనుమతులు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీ జెన్కో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు కేటాయించిన డంపింగ్ యార్డ్ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. డంపింగ్ యార్డ్‌కి, పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత స్థలం అవసరమో ఏపీ జెన్కో పంపు స్టోరేజ్ చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం టింబర్ డిపో వెనుక భాగంలో ఉన్న టన్నెల్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న పార్వతీ నగర్ వద్ద పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మించే ప్రదేశాన్ని డిఎఫ్ఓ పరిశీలించారు. అనంతరం డిఆర్ఓ సింహాచలం పడాల్ పంపు స్టోరేజ్ ప్రాజెక్టు సంబంధించి డీఎఫ్ఓకు వివరించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, ఏపీ జెన్కో పంపు స్టోరేజ్ ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఈ పంపు స్టోరేజ్ టి. అప్పలనాయుడు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యాధికారుల నిర్లక్ష్యంతో పసిబిడ్డ మృతి

**ప్రజాశక్తి-వై.రామవరం**

వైద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడు నెలలు పసి బిడ్డ మృతి చెందినట్లు గుర్తేడు సర్పంచ్ దుష్యంతుడు ఆరోపించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీ, జి.కొత్తూరు గ్రామానికి చెందిన గొల్లూరి దాలిమ తన మూడు నెలల పసిబిడ్డ అనారోగ్యానికి గురైతే బుధవారం గుర్తేడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. చిన్నారికి తూతూ మంత్రంగా వైద్య సేవలు అందించి, రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి రిఫరల్ చేశారని పేర్కొన్నారు. అయితే చిన్నారి పరిస్థితి విషమంచడంతో బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ వారు రోగులకు అందుబాటులో ఉండడం లేదని, ఈ విషయాన్ని గతంలో గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు ఐటిడిఎ పీఓ కట్టా సింహాచలంకు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయినప్పటికీ వారి తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు డుమ్మ కొడుతూ, రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందించని డాక్టర్లు, సిబ్బందిపై కలెక్టర్, పిఓ చర్యలు తీసుకోవాలని సర్పంచ్ దుష్యంతుడు డిమాండ్ చేశారు.

పసిబిడ్డ మృతదేహంతో తల్లి

## పర్యాటక సీజన్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు

### సయుక్త కలెక్టర్ అభిషేక్

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారి పనులు చురుకుగా జరుగుతున్నందున జిల్లాకు ట్రోమా కేర్ సెంటర్ అవసరమని, అందుకు అనుగుణంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ్ ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన రహదారి భద్రతా సమావేశంలో జేసి మాట్లాడుతూ, ప్రస్తుతం టూరిజం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఘాట్ రోడ్లలో రద్దీ పెరిగే అవకాశం ఉందని, వాహనదారులు అన్ని భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా వివిధ ప్రాంతాలనుండి వచ్చే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఘాట్ రోడ్లలో కొమ్మలు, పొదలు తొలగించాలని, అవసరమైన చోట్ల సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగని విధంగా (జీరో ఆక్సిడెంట్) డ్రైవ్ చేసిన డ్రైవర్లకు ప్రోత్సాహకం అందిస్తే వారు మరింత జాగ్రత్తగా ఉంటారని సూచించారు. గోల్డెన్ అవర్ పై ప్రచారం కల్పించాలని ఆదేశించారు.సలుగు, కోరవంగి రూట్లలో బస్సులు నడపడానికి చిన్న చక్రాల బస్సులు అవసరం ఉన్నందున వాటి సరఫరాకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాధికారి లీలా ప్రసాద్, మోటార్ వాహనాల అధికారి రాజేష్, ఆర్ టి సి డిపో మేనేజర్ ఉమా మహేశ్వర రెడ్డి, డిఎంహెచ్ఓ జమాల్ భాషా, డిసిహెచ్ఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ అభిషేక్

### బాధితున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:-** మండలంలోని పిత్తగూడ గ్రామంలో గురువారం ఎలుగుబంటి దాడిలో గాయపడి విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న గిరిజనులను స్థానిక అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం కేజీహెచ్‌లో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై అందుతున్న వైద్య సేవలపై సూపరింటెండెంట్, వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ట్రైబల్ సెల్ అధికారులను ఆదేశించారు.

### పౌర సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి -హుకుంపేట:**ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని పౌర మానవ హక్కుల జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు పౌర మానవ హక్కుల సంస్థ జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం ఎంపీడీఓ, పోలీస్, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ కార్యాలయలో పౌర సమాచార బోర్డులో పేర్లు, హోదా రాయాలన్నారు. పబ్లిక్ ఇన్ఫర్మేషన్, ఫోన్ నంబర్స్‌తో బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ సభ్యులు కామరాజు, కామేశ్వరరావు, శివ శంకర్, చిరంజీవి, కొండబాబు, సూరిబాబు శివ పాల్గొన్నారు.

### కాఫీ అమ్మకాలపై అవగాహన

**ప్రజాశక్తి -అనంతగిరి:**మండలలో కాశీపట్నం జీసిసీ మేనేజర్ మురళి శుక్రవారం మండలం లోని టోకురు పంచాయతీ చిసగుడ, దొరగుడ, నిసనిగుడ, బల్యగుడలో కాఫీ రైతులకు అవహన కల్పిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాఫీ రైతులు దళారులకు ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో తమ సిబ్బంది కొనుగోలు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అప్పన్న దొర, బలరాం పాల్గొన్నారు

### ఉపాధ్యాయుడు మృతి

**ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:**మండలంలోని వనుగుమ్మ జియుపి స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు కే.సత్యం శుక్రవారం మృతి చెందారు. విధులకు వెళ్లేందుకు మండల కేంద్రంలోని దుకాణాల సముదాయం వద్ద వాహనాల కోసం ఎదురుచూస్తూ కుప్ప కూలి పడిపోయాడు. తీవ్ర రక్తస్రావానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్సై రవీంద్ర సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.మండల ఎంఈఓ కృష్ణమూర్తి, సీఆర్పీలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నేతలు కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు.

### మత్స్యగెడ్డలో కొనసాగిన గాలింపు

**ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:**మండలంలోని దారేల పెద్ద పేట గ్రామ సమీపంలోని మత్స్య గెడ్డ వద్ద నాటు పడవ మునిగి గిరిజన యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ మేరకు గజ ఈతగాళ్ళతో గాలింపు చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ రవీంద్ర తెలిపారు. శుక్రవారం జరిగిన గాలింపు చర్యల్లో జి.మాడుగుల సర్కిల్ ఇనస్పెక్టర్ ప్రత్యేక చొరవతో ఎన్ డి ఆర్ ఏ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఎస్సై రమణ, సర్పంచ్ పాల్గొన్నారు.

### పంచాయతీల్లో శ్రమదానం

**ప్రజాశక్తి -పాడేరు:** పాడేరు డివిజన్ లోని 244 గ్రామ పంచాయతీలలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించినట్లు పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి పీఎంఆర్సి జంక్షన్ వరకు వరకూ నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, డి.యల్.పి.ఓ పిఎస్ కుమార్, స్థానిక సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఈవో ఆర్డీ రమేష్, వివిధ శాఖల ఉద్యోగులు, జీపు యూనియన్ ప్రతినిధులు, ప్రజలు పాల్గొని శ్రమదానంతో పరిసరాలు శుభ్రం చేసారు. అనంతరం సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఫ్రైడే డ్రైడేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు

### సబ్ కలెక్టర్ కల్పశ్రీ

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలో ఎవరైనా బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్, బాల్య వివాహాల నిర్మూలన కమిటీ చైర్‌పర్సన్ కల్పశ్రీ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండకుండా ఎవరైనా పెళ్లిళ్లు చేస్తే శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే పోలీసు స్టేషన్‌లోగాని, మహిళా పోలీసుకుగాని, అంగన్వాడీ టీచర్లకుగాని, ఎంఇఒకిగాని తెలియజేయాలని, లేదంటే 109, 100, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సంధ్యారాణి, ఎడిఎంహెచ్ఓ జి.శిరీష, సిఐ రవికుమార్, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామతులసి, మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ, వెలుగు డిపిఎం పరమేశ్వరరావు, హెల్త్ మానిటరింగ్ సెల్ అధికారి ఝాన్సీ, రమణి, అంగన్వాడి సూపర్వైజర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

## అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి-మారేడుమిల్లి :** విద్యార్థులు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని మారేడుమిల్లి సిఐ సిహెచ్ గోపాలకృష్ణ, ఎస్సై సాయి కుమార్ అన్నారు. మారేడుమిల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో గంజాయి వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత, ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే సమస్యలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గోపాలకృష్ణ, ఎస్సై సాయి కుమార్ మాట్లాడుతూ మైదాన ప్రాంతాల నుండి వచ్చిన కొంతమంది గంజాయి స్మగ్లర్లు గిరిజన యువకులకు అధిక డబ్బు ఆశ చూపి గంజాయి రవాణా చేయడానికి ఉపయోగించుకుంటున్నారని, పోలీసుల దర్యాప్తులో ఎక్కువమంది అమాయక గిరిజనులు గంజాయి కేసులకు బలవుతున్నారని పేర్కొన్నారు. కాబట్టి విద్యార్థులు గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. స్వగ్రామాలకు వెళ్ళినప్పుడు సామాజిక బాధ్యత వహించి కుటుంబ సభ్యులకు, తోటి వారికి గంజాయి వల్ల కలిగి దుష్పరిణామాలను వివరించాలని సూచించారు. ర్యాగింగ్‌కు గిరిజన విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం గంజాయి నివారణకు సంబంధించి స్వచ్ఛ సంకల్పం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ గోపాలకృష్ణ

### అంగన్వాడీ భవన నిర్మాణం పూర్తి చేయాలి : సిపిఎం

**ప్రజాశక్తి-చింతూరు :** మండలంలోని నారాయణపురం అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని నారాయణపురంలో శుక్రవారం జరిగిన సిపిఎం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. నారాయణపురంలో అంగన్వాడి భవనానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో నిధులు మంజూరైనా పూర్తి చేయలేదని, పాత భవనం శిథిలావస్థలో ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని మహాసభ పేర్కొంది. తక్షణమే అంగన్వాడి భవన నిర్మాణం పూర్తి చేయాలని, పాఠశాలకు భవన నిర్మాణం చేయాలని, వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. సోడే రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, స్థానిక నాయకులు సోలం పంతు, ముద్రం రంగమ్మ, ముట్టం రాజయ్య, సోదే రాజయ్య, తమ్మయ్య, విగ్నేష్, జోగయ్య, తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య

## వరద నష్ట పరిహారం, జీవన భృతి చెల్లించాలి

**ప్రజాశక్తి-కూనవరం**

గోదావరి వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు, నష్టపోయిన ముంపు బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన సాయం తక్షణమే చెల్లించాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నష్ట పోయిన వారికి రూ.10వేలు, జీవన భృతి రూ.4,800 చొప్పున అందరికీ అందలేదని తెలిపారు. అందరికీ న్యాయం చేస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. వరద నష్ట పరిహారం కోసం మండల ప్రజలు ప్రతి రోజూ ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హత ఉండి పరిహారం జమ కాని వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ, నాయకులు తలగాని నాగరాజు, షణ్ముకేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, పాయం సత్యనారాయణ, బాబురావు, ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అడవి దున్న దాడిలో గిరిజన మహిళకు తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-మారేడుమిల్లి**

మారేడుమిల్లి మండలం గుజ్జు మామిడి వలస గ్రామంలోని పొలంలో అడవి దున్న దాడి చేయడంతో గిరిజన మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మట్ల చంద్రకాంత అనే గిరిజన మహిళ తన పొలంలో శుక్రవారం పని చేస్తుండగా, అడవి దున్న దాడి చేసింది. ఈ దాడిలో ఆమె ముఖానికి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కారం లక్ష్మి మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా హాస్పిటల్‌కి తరలించారు.

గాయపడిన చంద్రకాంత

# 'మీ కోసం'లో 154 వినతులు

వినతులు స్వీకరిస్తున్న జెసి

**ప్రజాశక్తి-పాడేరు:** స్థానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 154 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ బి.పద్మావతిలు అర్జీదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అటవీ హక్కు పత్రాలు మంజూరు, భూ సమస్యలు, తాగునీటి సదుపాయాలు, రహదారుల నిర్మాణాలు, పాఠశాలలు, అంగన్వాడీ భవన నిర్మాణాలు మంజూరు చేయాలని పలువురు అర్జీలను సమర్పించారు. పాడేరు మండలం గొండెలి పంచాయతీ బతిడేపుట్టు గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తురాలు పాత్రుని కళావతి వినతి పత్రం సమర్పించారు. ముంచంగి పుట్టు మండలం సుజన కోట గ్రామ సర్పంచ్ వెంగడ రమేష్ బీట, తోటపుట్టు, తలాబు తోట గ్రామాల్లో పాఠశాల భవనాలు, కొత్త సుజన కోట గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మించాలని కోరారు. ముంచంగి పుట్టు మండలం పెదగూడ సర్పంచ్ మండి బాబూరావు బాకు బెడ గ్రామం నుండి దొరగూడ గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు, గూడ మాలిపుట్టు గ్రామంలో అంగన్వాడీ. పాఠశాల భవనాలు నిర్మించాలని వినతి పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు రాజు, కె.వేణు గోపాల్, పంచాయితీ రాజ్ ఇఇ టి.కొండయ్య పడాల్, జిల్లా వ్యవసాయాధికారి నంద్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డి.డి. ఎల్. రజని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, డివిజనల్ పంచాయితీ అధికారి పి. ఎస్.కుమార్, డి. ఆర్. డి. ఏ. పిడి. వి.మురళి, రహదారులు భవనాల శాఖ ఇ ఇ బాల సుందరబాబు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 62 మందికి ఉద్యోగాలు

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

**ప్రజాశక్తి-అరకులోయ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ( ఏపీఎస్ఎస్‌డిసి), జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో అరకు వేలి ఐటిఐ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 195 మంది హాజరవ్వగా, 62 మంది ఎంపికయ్యారు. ఈ సందర్బంగా ఏర్పాటైన సమావేశంలో అరకులోయ సీఐ హిమగిరి మాట్లాడారు. ప్రతి జాబ్ మేళాని వినియోగించుకోవాలని, ఎంత దూరమైనా ఉద్యోగానికి వెళ్లి పనిచేయాలని సూచించారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి మాట్లాడుతూ, నిరుద్యోగులు భవిష్యత్‌కు బాట వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎస్ఐ గోపాలరావు, జిల్లా ఎంప్లాయి మెంట్ ఆఫీసర్ సంగీత, సీడాప్ ప్రతినిధి భారతి, ఆర్ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### డ్రైడేపై అవగాహన

**ప్రజాశక్తి -అనంతగిరి:** మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీలో శుక్రవారం డ్రై డేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంపిపి నీలవేణి మాట్లాడుతూ, అరకు ప్రధాన రహదారిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుమార్, సెక్రటరీ. లావణ్య, సచివాలయం పాల్గొన్నారు.

# కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

**కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెల చిన్నబాబు**

**ప్రజాశక్తి- అరకులోయ రూరల్:** మాక్స్ సొసైటీ, జీసీసీ ప్రకటించిన కాఫీ ధరలు కార్పొరేట్ వ్యాపారస్థులకు లాభాలు చేసేవే తప్ప రైతులకు ఎటువంటి లాభం చేకూర్చేవి కావని కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు గెమ్మెల చిన్నబాబు అన్నారు. శుక్రవారం అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయితీ కె బెడ్డగూడ గ్రామంలో పర్యటించి కాపీ రైతులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ,కాపీ రైతుల అభిప్రాయాలు తీసుకొని మాక్స్ సొసైటీ కాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.మాక్స్ సొసైటీ ఒక వ్యాపార సంస్థ అన్ని జీసీసీ ఐటీడీఏ మాక్స్ సొసైటీ కు ఎలా వత్తాసు పలుకుతుందని ప్రశ్నించారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటే అసలైన కాఫీ రైతులతో చర్చించి ధర ప్రకటించాలన్నారు.అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ లో 2లక్షల 30 వేల మంది రైతులు కాఫీ పండిస్తున్నారని, ఈ పంటపైనే అధారపడి కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు.గతంలో కూడ ఇదే విదంగా ముందు గానే రేట్లు ప్రకటించి రైతుల నుండి ఈ సంస్థలు కొనుగోలు చేయడం లేదని దీంతో ఏమీ చేయాలో అర్థం కాక తక్కువ ధరకే దళారులు చేతుల్లో తీవ్రంగా మోసపోతారని అన్నారు..2018- 2023

మాట్లాడుతున్న చిన్నబాబు

వరకు కాఫీ రైతులకు చెల్లించాల్సిన ప్రోత్సహక నిధులు జమ కాలేదన్నారు. కిలో పాస్మెంట్ ధర రూ.500. అరబిక్ చెర్రీ 300, రోబస్టాచెర్రీ 200 గిట్టు బాటు ధరలు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి అప్పారావు, గెమ్మెల చిట్టిబాబు, సన్యాసి రావు,రామస్వామి ,కాఫీ రైతులు పాల్గొన్నారు.

# క్రూర మృగాలతో జాగ్రత్తగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:** ఎలుగుబంటి దాడిలో గాయపడిన పిత్తగూడ గ్రామంలో శుక్రవారం అటవీ శాఖ అధికారులు సందర్శించారు. క్రూర మృగాలు తారసపడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన ఆ గ్రామస్తులను శాఖ అధికారులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ డివిజనల్ అధికారి వెంకయ్య చౌదరి, ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ సంఘటనపై పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే విధంగా అధికారులతో చర్చించి నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఎలుగుబంటి సంచారంపై దండోరా వేయించి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి అప్పన్న, బీట్ అధికారులు రేణుక, అభిలాష్, ఉద్ధంగి ,రామచంద్రరావు, చంటి, సర్పంచ్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.1

## ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలి

**ప్రజాశక్తి-పాడేరు:** శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజక వర్గం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ముందుగానే అర్హత ఉపాధ్యాయులు ఓటర్ జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్ళతో జరిగిన సమావేశంలో జేసి మాట్లాడుతూ, ఆసక్తి, అర్హత ఉన్న ఉపాధ్యాయులు నవంబర్ ఆరవ తేదీలోగా టీచర్ల నియోజక వర్గం ఓటరుగా ఫారం 19 ద్వారా ఆన్లైన్లో, ఆఫ్ లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. గతంలో నమోదు చేసుకుని ఓటు ఉన్నప్పటికీ తిరిగి కొత్తగా నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 23 ఓటరు జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందని, ఆ రోజు నుండి డిసెంబర్ తొమ్మిది వరకు అభ్యంతరాలు, క్లైములు స్వీకరించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 25వ తేదీలోగా వాటిని పరిష్కరించి 30న తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని జేసి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అధికారి బి. పద్మావతి, డిఇఓ పి. బ్రహ్మాజీ రావు, ఎంఇఓలు, వివిధ కళాశాలల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండల కేంద్రలో అధికారులు, సచివాలయం సిబ్బంది స్వచ్చత హి సేవా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. షాపుల యాజమాన్యాలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీపీ కూడా రాజుబాబు మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి ఎం.అప్పలరాజు,వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు పాల్గొన్నారు.

## పెసా చట్టానికి లోబడి మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలి

**- ఆదివాసీ గిరిజన సంఘం**

**ప్రజాశక్తి-పాడేరు:** ఏజెన్సీలో పెసా చట్టానికి లోబడి మద్యం దుకాణాల ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ధర్మన్న పడాల్, పొద్దు బాలదేవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం పని వేళలలో తాళం వేసి ఉందన్నారు.అధికారులు ఎవరు లేరని కనీసం వినతి పత్రం కూడా తీసుకునే పరిస్థితి లేదని తక్షణమే జిల్లా కలక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెసా గ్రామసభ ఆమోదం, తీర్మానం అత్యంత కీలకమైనదని, చట్టవిరుద్ధంగా ఏజెన్సీ ఏరియాలో అమలు చేస్తున్న మద్యం షాపులు వేలం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరకువేలిలో ఆదివాసీ నిరుద్యోగులకు కేటాయించిన ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్ లో బినామీ పేరుతో మద్యం దుకాణం నిర్వహిస్తున్నారని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

# కెరీర్‌లో విద్యార్థి దశ కీలకం : పిఒ

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

**ప్రజాశక్తి-పాడేరు :** విద్యార్థి దశలో కెరీర్ మార్గ దర్శకం (కెరీర్ గైడెన్స్) కీలక పాత్ర పోషిస్తుందని ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ పేర్కొన్నారు. విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 పేరిట పది విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానాన్ని శుక్రవారం పరిశీలించారు. గత ఏడాది పదిలో సాధించిన ఉత్తమ మార్కులను ఈ ఏడాది విద్యార్థులు అధిగ మించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. పది తరువాత తీసుకోవాల్సిన ఇంటర్మీడియట్ గ్రూపులు, డిగ్రీలపై అవగాహన కల్పించారు. పది తరువాత పాలిటెక్నిక్, ఐటి ఐ వంటి సాంకేతిక కోర్సులు చదివితే ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న గ్రూపులలో చేరి ఉన్నతంగా చదువుకోవాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ ఎంఈర్డెన్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జ్ ఉపసంచాలకులు ఎల్ రజిని పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండలంలోని తడిగిరి మరియు ఉర్రాడ గ్రామంలో వరి మరియు రాగి పంటలకు పొలాలను శుక్రవారం పరిశీలించామని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.బి ప్రసాద్ కుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాదికారి ఎం.విజయలక్ష్మి. అన్నారు. రసాయనాలు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలను పండించాలని వారు సూచించారు.తెగుళ్ల రాకుండా పసుపు జిగురు అట్టలు పెట్టు కోవాలన్నారు.తెగుళ్ల వచ్చినప్పుడు వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ సీఈవో నాగమణి, ఈశ్వరి, మండలం వ్యవసాయ అధికారి ఎం లీలావతి పాల్గొన్నారు.1

## విద్యార్థులకు సౌకర్యాలు కల్పించండి

**- అనకాపల్లి జిల్లా న్యాయమూర్తి ధర్మారావు**

**ప్రజాశక్తి - చింతపల్లి :** ఆశ్రమ, బాలసదనం పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అనకాపల్లి జిల్లా న్యాయమూర్తి జీ.ధర్మారావు సూచించారు. చింతపల్లి బాలసదనం పాఠశాలను స్థానిక ఏటిడబ్ల్యూఓ బలిరెడ్డి జయ నాగలక్ష్మితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు.మరుగుదొడ్లు, తాగునీరు, పడకల సౌకర్యాలపై బాలసదనం సూపరిండెండెంట్ వరలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. భవనాలు కొరత లేకుండా చూడాలన్నారు. వాచ్మెన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపీవో రమణి, ఎంఈవో బోడంనాయుడు, బాలసదనం ఆశ్రమం అకౌంటెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మెరకచింతలో పల్లె పండగ

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండలంలోని మెరకచింత పంచాయితీలో పల్లె పండగలో భాగంగా సర్పంచ్ దూసూరు పద్మ కుమారి, ఎంపీటీసీ నైని రజని, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావులు టెర్రా సింగ్ పనులు శుక్రవారం ప్రారంబించారు. అనంతరం వారు మాట్లాడుతూ, టెర్రా సింగ్ పనులతో రైతుల వ్యవసాయం అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శైలజ, మెరకచింత వైస్ సర్పంచ్ నైని బొంజు బాబు, మాజీ సర్పంచ్, సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, టిడిపి యువ నాయకులు శంకర్ నాయుడు, మాజీ వైస్ సర్పంచ్ పూజారి రమణ బాబు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

**ప్రజాశక్తి-పాడేరు:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠము ద్వారా 2024-2025 విద్యా సంవత్సరంనకు సంమందించి పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో ఎటువంటి అపరాద రుసుము లేకుండా అడ్మిషన్ పొందడానికి అక్టోబర్ 25వ తేదీ తుది గడువుగా పొడిగించడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆర్. శశి కుమార్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 200లు ఆలస్య ఫీజుతో 29వ తేదీ వరకు, రూ. 500లు 31వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతిలో చేరుటకుగాను 14 సంవత్సరాలు నిండాలని, ఇంటర్మీడియట్‌లో చేరుటకుగాను పదవ తరగతి పాసై 15ఏళ్లు నిండిన వారు దరఖాస్తులు చేయుటకు అర్హులని తెలిపారు.

## మద్యం షాప్ తొలగించాలని పిఒ ఆదేశం

**ప్రజాశక్తి-అరకులోయ :** అరకు వ్యాలీ గిరిజన మ్యూజియం షాపింగ్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన వైన్ షాపును వెంటనే తొలగించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఎక్సైజ్ అధికారులను శుక్రవారం ఆదేశించారు. షాప్ నంబర్ 21 లో ఏర్పాటు చేస్తున్న వైన్ షాపును వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఐటిడిఏ షాపింగ్ కాంప్లెక్స్ లో బినామీలు వైన్ షాపులను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైన్ షాపును ఖాళీ చేయించి వెంటనే నివేదిక సమర్పించాలని చెప్పారు.

## ఎఐ, ఎంఎల్‌తో మెరుగైన ఉపాధి

మాట్లాడుతున్న ఎయు విసిశశిభూషణరావు

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) తదితర సాంకేతికతలతో భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. శుక్రవారం ఎఐసిటి వైబ్రెంట్ ఎడ్వకసి ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(వాణి) సహకారంతో ఎయు ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'ఏఐ, ఎంఎల్, డిఎస్‌పై తెలుగులో చర్చావేదికను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2026 నాటికి వీటి అనువర్తనాలను 75శాతానికి పైగా వినియోగి స్తారన్నారు. ప్రజల్లో వీటిపట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది నూతన ఉపాధి అవకశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేశ, విదేశీ నిపుణులతో ఎయు, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఎయు కేంద్రీయ విద్యా సంస్థ లైన ఐఐటిల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు.

సిఎస్ఇ విభాగం ఆచార్యులు ఆచార్య ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నూతన సాంకేతికతలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృభాషలో అందరికీ చేరువ చేసే విధంగా కృషి జరపాలన్నారు. దీనికి నాందిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు.ఐటి విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వర రావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడం వలన మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. టెక్నాలజీ అందరికీ చేరువ కావాలన్నారు. సిఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట రావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం ఎంతో అవసరమని, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో రెండురోజుల చర్చ వేదిక సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ తదితరులు ప్రసంగించారు. అనంతరం అమెరికా నుంచి ఏఐ సాంకేతికత భవిష్యత్ అంశంపై సునీల్ ఎస్ రంక, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఈఓ రవి ఈశ్వరపు, న్యూరల్ నెట్ వర్క్స్‌పై విజయ్ ప్రసంగించారు.

# కొత్త పాలసీపై కోటి ఆశలు

**- గతానికి భిన్నంగా పారిశ్రామిక విధానం ఉండాలని పలువురి ఆకాంక్ష**
**- 23న కేబినెట్ ఆమోద ముద్ర నేపథ్యంలో.. విశాఖ ఎపిఐఐసి భూములపై ప్రభుత్వం ఆరా**
**- ఇప్పటికైనా పరిశ్రమలకు రూ.100 కోట్ల ఇన్సెంటివ్ బకాయి దక్కేనా ?**

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోయే పారిశ్రామిక విధానం గతం కన్నా కాస్తయినా భిన్నంగా ఉండాలన్న ఆకాంక్షతో విశాఖ పారిశ్రామికవేత్తలు ఆరాటపడుతున్నారు. విశాఖ అంటేనే పరిశ్రమలకు పెట్టింది పేరు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు అనుసంధానంగా ఇండస్ట్రియల్ జోన్, పారిశ్రామిక ఎస్టేట్‌లు కొలువై ఉన్న సంగతి తెలిసిందే. అయితే, కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చాక విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేందుకు లేదా ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయించడంతో కొత్త పరిశ్రమలపై నీలినీడలు అలముకుంటూ వస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సంగతిని రాష్ట్ర ప్రభుత్వం తేల్చుకోకుండానే కొత్త పాలసీకి సిద్ధమైపోవడం సర్వత్రా చర్చసాగుతోంది. ఈ నెల 23న జరగనున్న కేబినెట్ సమావేశంలో సమగ్రంగా ఒక పత్రంలో 2024-29 సంవత్సరాలకు సంబంధించిన పారిశ్రామిక అంశాలన్నిటినీ వెల్లడించనున్న నేపథ్యంలో విశాఖలో ఎపిఐఐసి వద్దగల భూములు, గతంలో కేటాయింపులకు సంబంధించిన వివరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆరా తీసినట్లు తెలుస్తోంది. భూ సేకరణకు ఆటంకంగా ఉన్న అంశాలపైనా ప్రభుత్వం దృష్టిసారించింది. త్వరలో టిసిఎస్ విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రి లోకేష్ సహా ఇతర పెద్దలంతా పదేపదే చెబుతున్న సంగతి తెలిసిందే.

**పెట్టుబడులకు ద్వారాలు**

పెట్టుబడులకు పూర్తి మద్దతు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకున్న నేపథ్యంలో పారిశ్రామిక నగరిలో ఐటి, వస్తూత్పత్తి రంగ పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక గతంలోకి వెళ్తే.. అదానీ డేటా సెంటర్ విశాఖకు వస్తుందంటూ ఊరించిన జగన్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చంద్రబాబు సర్కారు ఈ అంశంపైనేగాకుండా లూలూ ప్రాజెక్టు, అదానీ డేటా సెంటర్, టిసిఎస్ పట్ల శ్రద్ధ చూపడంతో నిరుద్యోగ యువత అంతా ఆశగా ఎదురు చూడడం కనిపిస్తోంది. ఐటి సంస్థలకు సంబంధించి చూస్తే గతం నుంచీ విశాఖ ఎంఎస్ఎంఇ, సాఫ్ట్‌వేర్ సంస్థలకు రూ.100 కోట్ల మేర ఇన్సెంటివ్‌లు (పరిశ్రమలు పెట్టినందుకుగానూ ప్రభుత్వం ఇస్తానన్నవి) సాయం ఇంతవరకూ అందలేదు. దీన్ని ముందుగా కూటమి ప్రభుత్వం క్లియర్ చెయ్యాలన్న డిమాండ్ కూడా ఈ సంస్థల నుంచి వినిపిస్తోంది.

**కొత్త పాలసీ ఎలా ఉండబోతుంది ?**

2024-29 పారిశ్రామిక విధానం ఇప్పటి వరకూ వెల్లడైన పత్రాలను బట్టి చూస్తే గతంలో 2014 - 2019 మధ్య ఎలాంటి లెక్కలైతే పరిశ్రమలు, ఉపాధికి సంబంధించి సిఐఐ సమావేశాల సందర్భంగా ప్రకటించారో అవే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు రూ.30 లక్షల కోట్లతో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 20 లక్షల మేరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం పాలసీలో పేర్కొనబోతుంది. ముఖ్యంగా మానుఫ్యాక్చరింగ్ సెక్టార్‌ను రూ.83 వేల కోట్లతో అభివృద్ధి చేయడం, రూ.50 వేల కోట్లను తీసుకొచ్చి ఎంఎస్ఎంఇల యూనిట్ల స్థాపించడం తద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పించడం లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ఇండస్ట్రియల్ పాలసీని తేనుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం సాగుతోంది.

అయితే, ఐటికి సంబంధించి ఎపి, విశాఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఎదుర్కొనే ప్రధాన సమస్య ఒకటుంది. ఏదైనా ఒక ఐటి ప్రాడక్ట్‌ను ఒక సంస్థ అభివృద్ధి చేస్తే దాని సర్టిఫికేషన్ కోసం అహ్మదాబాద్, పూణె వెళ్లాల్సి వస్తోంది. విశాఖ ఐటి కేపిటల్ అంటూ ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయే తప్ప కేంద్రం నుంచి సాధించలేకపోతున్నాయని సాఫ్ట్‌వేర్ నిపుణులు ఆవేదన చెందుతున్నారు. గతం నుంచీ విశాఖ, తిరుపతిలో చెరో ఐటి రీసెర్చి సెంటర్ ఏర్పాటుకు హామీలున్నాయి. వాటిని నెరవేర్చాలని పలువురు కోరుతున్నారు.

### జామియా మసీదు పునర్నిర్మాణం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** పాత నగరంలో అతి ప్రాచీనమైన, ప్రసిద్ధి చెందిన చెంగళరావుపేటలోని జామియా మసీదు శిథిలావస్థకు చేరిందని, దీనిని పునర్నిర్మాణం చేయనున్నామని మసీదు పెద్దలు తెలిపారు. శుక్రవారం జామియా మసీద్ సంగ్ - ఎ - బునియాద్ (మసీదు పునర్నిర్మాణ పని) కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. మసీదు నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.

### అదనపు స్లీపర్ క్లాస్ కోచ్‌లు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** పండగ సీజన్‌లో వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే అదనపు బోగీలతో రైళ్లను పెంచాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 18117 రూర్కెలా - గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబర్ 20, 21 తేదీలలో, 18118 గుణుపూర్ - రూర్కెలా రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్, అదేవిధంగా 18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబర్ 20, 21 తేదీల్లో, 18108 జగదల్‌పూర్ - రూర్కెలా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు 21, 22 తేదీల్లో ఒక స్లీపర్ క్లాస్ కోచ్ చొప్పున జతచేయనున్నారు.

### విశాఖ మార్కెట్‌లోకి టయోటా అర్బన్ క్రూజర్ టైజర్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** టయోటా కిర్లోస్కర్ మోటార్ సంస్థ తమ నూతన వాహనమైన అర్బన్ క్రూజర్ టైజర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ను విశాఖ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా మద్దిలపాలెంలోని టయోటా షోరూంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ విశాఖపట్నం ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక ఎడిషన్ స్టైల్ ప్రీమియం నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందని తెలిపారు.

### శ్రీనివాసరావు మృతి బాధాకరం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** సర్వ శిక్ష అభియాన్ పిఒగా పనిచేసి బదిలీపై మాతృ సంస్థకు వెళ్లిన బి.శ్రీనివాసరావు ఆకస్మిక మృతి పట్ల జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తీవ్ర సంతాపం తెలిపారు. విజిలెన్స్ కమిటీ సమావేశంలో భాగంగా ఎమ్మెల్సీ పి.రవీంద్ర బాబు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. సమగ్ర శిక్షా అభియాన్ పాజెక్టు అధికారిగా ఆయన సేవలు మరువలేనివన్నారు.

పరిసరాలను శుభ్రపరుస్తున్న సర్పంచ్ సరోజిని తదితరులు

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**ప్రజాశక్తి-విఆర్.పురం :** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మండలంలోని రేఖపల్లి పంచాయతీ సర్పంచ్ పూనం సరోజిని అన్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ ఆదేశాల మేరకు రేఖపల్లి పంచాయితీలోని ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్లు, రోడ్లపై శ్రమదానం కార్యక్రమం ద్వారా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనం సరోజిని మాట్లాడుతూ రేఖపల్లిలో ప్రతి షాపులో చెత్త కుండీ ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడికక్కడ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తే కొంతమేర దోమల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సెక్రటరీ, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### సురవరం గ్రామానికి రహదారి నిర్మాణం చేయాలి

**ప్రజాశక్తి-సీలేరు :** జీకే వీధి మండలం లక్కవరంపేట పంచాయతీ పరిధి సురవరం గ్రామానికి రహదారి నిర్మాణం చేయాలని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ సాగిన పెద్దబ్బాయి, ఉపసర్పంచ్ గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బురద, గోతులతో ఉన్న మట్టి దారికి గ్రామస్తులు శ్రమధానంతో మరమ్మతులు చేసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి రహదారి లేక 30 ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిమ్మలపాలెం నుంచి కొత్తపాకల వరకు ఐదు కిలోమీటర్లు బీటీ రోడ్డు వేయడానికి 2018లో ప్రభుత్వం రూ.4.60 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అటవీశాఖ క్లియరెన్స్ రాకపోవడంతో అప్పటినుంచి రహదారి నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చినుకు పడతే రహదారి చిత్తడి చిత్తడిగా తయారవుతుందని వాపోయారు. రహదారి నిర్మాణం చేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్‌కు, సభ కలెక్టరుకు తాము స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారు 2018లో మంజూరైన నిధులు ఉన్నాయా? లేక కొత్తగా నిధులు మంజూరు చేయాలన్న అంశాన్ని పరిశీలన చేసి రహదారి నిర్మాణానికి తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే నిమ్మలపాలెం, సురవరం, పిల్లి గొంది, కొత్త పాకల గ్రామాల ప్రజల రాకపోకలకు దోహదపడుతుందని చెప్పారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో వైద్య సేవలు పొందడానికి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

### సిఆర్‌పిఎఫ్ ఆధ్వర్యాన 'స్వచ్ఛతా హీ సేవా'

**ప్రజాశక్తి - సీలేరు :** సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వికాస్ కుమార్ పాండే ఆధ్వర్యంలో జీకే వీధి మండలం సీలేరులో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్న మెయిన్ డ్యామ్ చివర ప్రదేశంలో చెత్తా చెదారాలను సిఆర్పిఎఫ్ పోలీసులు తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వికాస్ కుమార్ పాండే మాట్లాడుతూ తరచూ పర్యాటకులు సీలేరు తరలివచ్చి జల విద్యుత్ కేంద్రం, ఇంటేక్ డామ్, రెగ్యులేటర్ మెయిన్ డ్యాం తదితర ప్రదేశాలను తిలకిస్తున్నారని తెలిపారు. ప్రకృతి రమణీయమైన ప్రదేశాలను కొందరు యువకులు పాడు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు.

### నూతన తహశీల్దార్‌ను కలిసిన సిపిఎం నేతలు

**ప్రజాశక్తి-విఆర్.పురం :** మండల తహశీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సరస్వతిని ఎంపిపి కారం లక్ష్మి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, సిపిఎం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విది నిర్వహణలో సిపిఎం తోడుగా ఉంటుందని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ, మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లాది రమేష్, జి.లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, ఎన్.ప్రకాష్ పాల్గొన్నారు.